జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 9-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 188 పేజీలు: 8 వెల : రూ.7

# గల్లీకో.. బెల్టు!



- జిల్లాలో జోరుగా మద్యం బెల్ట్ షాపులు
- గ్రామాల్లో ఎక్కడికక్కడ అనధికార దుకాణాలు
- ప్రైవేట్ మద్యం షాపుల నుంచి తరలిపోతున్న వైనం
- బెల్ట్ తీస్తాం.. ఒత్తి మాటలేనా?
- మద్యం షాపుల్లో అగ్రభాగం అధికార పక్షానివే అన్న విమర్శలు
- దాడులు చేయొద్దని అధికార పక్ష నేతల ఒత్తిడి
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న కొందరు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 8 (వార్త): ఎక్కడైనా మద్యం బెల్ట్ షాపులు పెడితే.. తాటా తీస్తామని స్వయంగా రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల జరిగిన ఓ సభలో హెచ్చరికలు చేశారు.. మరోపక్క సీఎం చంద్రబాబు సైతం ఇదేవిధమైన ప్రకటన కూడా జారీ చేశారు. ఆ హెచ్చరికలను బెల్ట్ షాపుల నిర్వాహకులతో పాటు లైసెన్సు పొందిన మద్యం షాపుల నిర్వాహకులు సైతం పట్టించుకోవడం లేదు. జిల్లావ్యాప్తంగా 158 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ దుకాణాలు అధికార పక్షానికి చెందిన నేతలవే. లక్షలు పోసి షాపులు దక్కించుకున్నాం.. లూజు అమ్మకాలతో మాకేం వస్తుంది.. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తేనే మాకు గిట్టుబాటు అవుతుందని నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు. అధికార పక్షం ఒత్తిడితో ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది ఈ వ్యవహారాన్ని చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎవరైనా సమాచారం అందించితే మాత్రం దాడులు చేస్తూ కేసులు పెడుతున్నారు. రణస్థలం మండలం పైడిభీమవరంలో ఆదివారం ఓ వ్యక్తి వద్ద 174 మద్యం సీసాలపై జేఆర్ పురం పోలీసులు పట్టుకున్నారు. ఇలా నిత్యం ఏదో ఒక మండలంలో మద్యం పట్టుబడుతునే ఉంది. దీన్నిబట్టి చూస్తే బెల్ట్ షాపులకు ఏ మేరకు మద్యం రవాణా అవుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇటు మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు మాత్రం బెల్ట్‌కు ప్రోత్సహిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం దీనిపై ఎటువంటి చర్యలు చేపడుతుందో చూడాలిమరి.



# సంక్రాంతికి.. శ్రీకాకుళం నుంచి.. ప్రత్యేక రైళ్లు



- శ్రీకాకుళం రోడ్డులో అరసవల్లి సూర్యదేవాలయం ఆకృతి నిర్మించండి
- ఆరు ప్లాట్‌ఫారాలకు పెంచాలి
- నౌపడ - గుణుపూర్ రైల్వే లైన్‌ను విస్తరించండి
- దూసిలో గాంధీ స్మారక భవనం నిర్మించండి
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- రైల్వే పెండింగ్ పనులపై వాల్తేర్ డివిజనల్ అధికారులతో సమీక్ష

**శ్రీకాకుళం, డిసెంబర్ 8 (వార్త):** ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వేలాది మంది వలస కార్మికులు సంక్రాంతికి స్వస్థలాలకు చేరుకుంటారని, రద్దీకి అనుగుణంగా జనవరి 10, 11, 12 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి, 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం నుంచి ప్రత్యేక రైళ్లు నడపాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రైల్వే అధికారులకు సూచించారు. జిల్లా సమగ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే రైల్వే పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వివిధ స్టేషన్లలో అభివృద్ధి పనులతో పాటు కొత్త రైళ్లను కేటాయింపు చేయాలని సూచించారు. వాల్తేర్ ఏడీఆర్ఎం మనోజ్ సాహు అధ్యక్షతన, సీనియర్ డీఈఎన్ వెంకటరమణ పర్యవేక్షణలో ఆదివారం జరిగిన డివిజనల్ రైల్వే సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమృత్ భారత్ పథకంలో ఎంపికైన శ్రీకాకుళం రోడ్డు, పలాస, ఇచ్ఛాపురం, నౌపడ స్టేషన్లలో జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లో జిల్లా ప్రత్యేకతను తెలియజేసేలా అరసవల్లి సూర్య దేవాలయం ఆకృతి నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఇక్కడ 4 ఫ్లాట్ ఫాంలు మాత్రమే ఉండగా.. దీనిని 6 ఫ్లాట్‌ఫాం లకు విస్తరించడంతో పాటు రెండు వైపుల నుంచి రాకపోకలు సాగించేలా విస్తరణ పనులు చేపట్టాలన్నారు. ఉర్లాం స్టేషన్ అభివృద్ధి, కామేశ్వరిపేటలో పాసింజర్ హాల్టు కల్పించడంతో పాటు మెమూ రైళ్లను నిలుపుదల పునరుద్ధరించాలని పేర్కొన్నారు. కోటబొమ్మాళి, పూండిలో భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని నౌపడ నుంచి ఒడిశా లోని గుణుపూర్ మధ్య ఉన్న సింగిల్ లైన్ లో మరిన్ని రైళ్లు రాకపోకలు చేసేలా తెంబూరు, కాశీనగర్‌లో క్రాసింగ్ సౌకర్యం కల్పించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సూచించారు. అలాగే టెక్కలి, పాతపట్నం స్టేషన్లను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నౌపడలో కొత్త ఎఫ్ఓబీ, ప్రయాణికుల వెయిటింగ్ షెడ్డు, పూండిలో ఎఫ్ఓబీ, హరిశ్చంద్రపురంలో ప్రయాణికుల భవనం, కొత్త రోడ్డు.. రౌతుపురంలో ఫ్లాట్ ఫాం పనులు పూర్తి చేయడంతో పాటు వేగవంతంగా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. దూసి రైల్వే స్టేషన్‌కు జాతిపిత మహాత్మాగాంధీ వచ్చిన విషయాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో గాంధీ స్మారక భవన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన వాల్తేర్ డివిజనల్ అధికారులు.. ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలియజేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**పలాస, డిసెంబర్ 8(వార్త):** టెక్కలి మండలం లచ్చన్నపేట గ్రామ సమీప జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు పలాస మండలం పెద్ద నారాయణపురం కోవెల వీధికి చెందిన పిట్ట రవిగా పోలీసులు గుర్తించారు. కారు ఢీకొని మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



# ఉద్దానం భూములను పరిరక్షిద్దాం

**మందస, డిసెంబర్ 8(వార్త):** మందస మండలంలోని రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలో ఉద్దానం తీర ప్రాంత భూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కొమర వాసు నేతృత్వంలో మందస, వజ్రపుకొత్తూరు మండలాల ఎయిర్‌పోర్ట్ భూబాధిత కుటుంబాలతో ఆదివారం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ పార్టీ లకతీతంగా అందరం ఏకమై ప్రతీ గ్రామం నుంచి నష్టపోతున్న రైతులు తరపున ఒక కమిటీ ఏర్పాటు చేసి భవి ష్యత్ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



బత్తిని లక్ష్మణ్ మాట్లాడుతూ మాటలకు, చేతలకు పొంతనలేని ఈ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి ప్రజల్లో అనేక ప్రశ్నలు, అనుమానాలను రేకెత్తిస్తోంది, సమస్యల కన్నా ముందు ప్రజలు అడుగుతున్న మౌలిక ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పాలకులు అన్నింటికి అభివృద్ధే జవాబని బదులిస్తున్నారన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సంబంధం లేకుండా జరిగే కార్గో ఎయిర్ పోర్ట్ ప్రక్రియను అభివృద్ధి అనగలమా అని ప్రశ్నించారు. ఎవరికి నచ్చిన రాజకీయ పార్టీకి వాళ్లు మద్దతు ఇచ్చుకోండి.. కానీ మన భూముల్ని మాత్రం ఇవ్వ కూడదని మనందరి మాట ఒకటే మనందరి పోరాటం ఒక్కటే అన్నారు. మనందరి పార్టీ ఒక్కటే అదే భూ బాధితుల పార్టీ అన్నారు. భూ బాధితులు ఎవరు మీద ఆధారపడవద్దని, మనకి మనమే కలిసి పోరాటాలు చేస్తే తప్పకుండా మన హక్కులు మనం సాధించుకుంటామన్నారు.

కార్యక్రమంలో బాధిత రైతులు సర్పంచ్ పొట్టి ధర్మారావు, చిత్త కూర్మారావు, చిత్త గున్నయ్య, దున్న రామారావు, తామాడ తుంబనాథం, గుంటు లోకనాథం, దున్న సింహాచలం, బత్తిని ఉమాపతి, జుత్తు హేమ రాజు, గార ఆనంద్, మడియా రుషి, బత్తిని దేశయ్య, దున్న హరికృష్ణ, మర్ల సంతోష్, మామిడి తులసయ్య, కొండ వాసు, తామడ రమేష్, సర్పంచ్ జోగి అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు తిర్రి రాజారావు, నల్ల పరుశురామ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# హరిశ్చంద్రుడి జీవితం ఆదర్శనీయం



**పోలాకి, డిసెంబర్ 8(వార్త):** భవిష్యత్ తరాలకు సత్య హరిశ్చంద్రుడు జీవితం ఆదర్శం కావాలని పాలకొండ ప్రాంతీయులు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సత్యసాయి సేవా సమితి ప్రతినిధి ఎన్వీ రమణ అన్నారు. ఆదివారం చింతాడ పేట శ్రీరామయోగి ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సత్యం, న్యాయం, ధర్మం..మనిషి వ్యక్తిత్వం కంటే గొప్పవన్నారు. నాటి ఇతిహాసాలు పురాణాలతో నేటి జీవితం పరమార్థం కావాలని ఆకాంక్షించారు. ఆనాటి చరిత్ర మనిషి అభివృద్ధికి దోహదం పడుతుందన్నారు. కోరికలు, అత్యాశలు తగ్గించుకోవాలని సూచించారు. ఆధ్యాత్మికవేత్త మోహనరావు మాట్లాడుతూ దశావతారాలు, నల మహారాజు జీవిత చరిత్రను భక్తులకు వివరించారు. ఊడికిలపాడు సత్సంగం సభాధ్యక్షుడు సనపల కరుణాకరరావు మాట్లాడుతూ వచ్చే జనవరి 5న రాష్ట్ర రాజధాని పరిధిలో జరగబోయే హైందవ శంఖారావంను జయప్రదం చేయాలని కోరారు. గున్నయ్యస్వామి మాట్లాడుతూ రామాయణంలో కొన్ని ఘట్టాలను భక్తులకు వివరించారు. కరుకోల అనంతస్వామి మాట్లాడుతూ తెల్ల కాగితంలా జన్మించినప్పుడు మంచి అధ్యయనంతో లిఖించి మరణించాలని ఆకాంక్షించారు. ఎవరి మనసు వారి తెలుసుకున్నప్పుడే భగవంతుడు దర్శనం పొందవచ్చన్నారు. సింగుపురం లక్ష్మణరావు స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రియాగ్రహారానికి చెందిన కోరాడ పెంటయ్య, మూలపేట గ్రామానికి చెందిన మూల భీమారావు కీర్తనలు ఆలపించారు.

అనంతరం ముఖ్య అతి థికి ఆశ్రమం ప్రతినిధులు గోపాలరావు గోవిందరావు సన్మానించారు. అనంతరం దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులందరికీ నారాయణ సేవ గావించారు.

# ముస్లిం కాలనీ స్థలం కబ్జాకు యత్నం..!

**పలాస, డిసెంబర్ 8(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి సూదికొండ ప్రాంతంలోని ముస్లింలకు చెందిన ప్రభుత్వ స్థలం కబ్జాకు కొంత మంది ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. సర్వే నెంబర్ 38లో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కాలనీ ఉంది. ఆ కాలనీలో మరుగుదొడ్లను 1996లో ప్రభుత్వం నిర్మించింది. కాలనీ పక్కనే అప్పట్లో ప్రభుత్వం మసీదు నిర్మాణం కోసం కొంత స్థలం మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ మసీదుకు కేటాయించిన స్థలంతో పాటు మరుగుదొడ్లను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. మరుగుదొడ్లను ఎక్స్‌కవేటర్‌తో శనివారం ధ్వంసం చేశారు. ముస్లింలకు చెందిన ఈ స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్లు వేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో ఈ స్థలాన్ని ఓ తెలుగుదేశం నాయకుడు ఆక్రమించేందుకు ప్రయత్నించగా దీనిపై పలాస కోర్ట్‌లో కేసు నమోదైంది. దీంతో ఆయన ఆ జోలికి పోలేదు. ఇదిలా ఉంటే 1996లో అప్పటి భారీ పరిశ్రమ శాఖల మంత్రి బషీరుద్దీన్ బాబూఖాన్ సర్వే నెంబర్ 38లో 50 మంది ముస్లింలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఒక ఇంటికి నిర్మాణం కొరకు 12000 రూపాయలు కూడా వారికి అందజేశారు. అలాగే మరుగుదొడ్లకు మూడు వేల రూపాయలు మంజూరు చేయడంతో మరుగుదొడ్లు నిర్మించారు. అక్కడ నివాసముంటున్న 50 మంది ముస్లింల కుటుంబాలలో 45 మంది తమ ఇళ్లను గారడి చేసే వాళ్లకు అమ్మకాలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే మిగిలిన 5 ఇళ్ల స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అప్పుడు కూడా పట్టాదారులు వీళ్లపై దావా వేశారు. కోర్టులో కేసు నడుస్తుండగా గతంలో కబ్జాకు ప్రయత్నించిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ప్రోద్బలంతో దౌర్జన్యంగా ముస్లింల మరుగుదొడ్లను ఇప్పుడు ధ్వంసం చేశారు. అక్కడ సమీపంలో మసీదు నిర్మాణానికి కేటాయించిన స్థలం కూడా కబ్జా చేసి ప్లాట్లుగా అమ్మకాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ స్థలంను ముస్లింలే కొనుగోలు చేయడం కొసమెరుపు. ప్రభుత్వ కాలనీ ఆక్రమణలపై స్థానిక రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని పట్టాదారులైన ముస్లిం మహిళలు కోరుతున్నారు.





## ఆత్మీయ సమావేశాలు విజయవంతం

**వంగర, డిసెంబర్ 8(వార్త):** పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ఆంధ్ర రాష్ట్ర ఉమెన్స్ కాపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కావలి గ్రీష్మ తెలిపారు. ఆదివారం ఆమె ఫోన్‌లో జాతీయ వార్త ప్రతినిధితో మాట్లాడారు. రాష్ట్రం మొత్తం అత్యద్భుతంగా విజయవంతం చేసిన ఉపాధ్యాయులను కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖా మంత్రి లోకేష్.. రాష్ట్రంలో విద్యారంగాన్ని మెరుగుపరచడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారన్నారు. భారతదేశంలో ఎన్నికల నిర్వహణ ఉపాధ్యాయుల అకుంఠిత దీక్ష వల్లనే సాధ్యమైందన్నారు. అనంతరం గ్రీష్మను పేరెంట్స్, ఉపాధ్యాయులు గ్రీష్మను ఘనంగా సన్మానించారు.

## ఆదిత్యుడి ఆదాయం రూ.4.72లక్షలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 8(వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారికి ఆదివారం రూ.4,72,665ల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. టికెట్లు రూపేణా రూ.2,06,600లు, పూజలు, విరాళాల రూపంలో రూ.72,050లు, ప్రసాదాల రూపంలో రూ.1,94,015లు వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

## మద్యం అక్రమ నిల్వలపై ఆకస్మిక దాడి



**శ్రీకాకుళం, డిసెంబర్ 8(వార్త):** జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధి పైడి భీమవరంలోని మద్యం అక్రమ నిల్వలపై దాడులు నిర్వహించి, 174 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. వీటిని కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. ఆయనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. మద్యం అక్రమ రవాణా, విక్రయాలు జరపడం నేరమన్నారు. అట్టి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుంటామని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్, మద్యం అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఆయన ప్రజలకు సూచించారు. సమాచారం అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

## ఆదిత్యుడిని దర్శించుకున్న ట్రాన్స్‌కో ఎస్పీ

**శ్రీకాకుళం, డిసెంబర్ 8(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం ట్రాన్స్‌కో ఎస్పీ సీహెచ్ రామకృష్ణ ప్రసాద్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు స్వామి వారి ప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారని ఆలయ ఈవో వై. భద్రాజీ తెలిపారు.



## బైక్‌లు ఢీకొని.. ముగ్గురికి గాయాలు

**సోంపేట, డిసెంబర్ 8(వార్త):** బేసి రామచంద్రాపురం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా పలాస, పాతపట్నం నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న బారువ పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తులను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## రహదారులు, వంతెనలు పూర్తి చేయాలి

**మందస, డిసెంబర్ 8(వార్త):** ఐటీడీఏ(ట్రైబల్ వెల్ఫేర్) మందస డీఈఈ కార్యాలయ అధికారులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ ఎస్.రమాదేవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణకుమార్, జేఈ అబ్రహం.. ఐటీడీఏ పరిధిలో గల రహదారులు, వంతెనలు, మౌలిక సదుపాయాలపై చర్చలు జరిపారు. అసంపూర్తిగా ఉన్న రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఏయే ప్రాంతాల్లో ఏమి అవసరాలున్నాయో గుర్తించాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, శ్రీను, సిబ్బంది కూడా ఉన్నారు.

## పారమ్మకు ఘన నివాళి



**పలాస, డిసెంబర్ 8(వార్త):** ప్రజా కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ కొర్రాయి నీలకంఠం మాతృమూర్తి పారమ్మకు పలువురు ఘన నివాళులర్పించారు. ఆమె ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం పెద్దకర్మ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఢిల్లీరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఈ రహదారికి మోక్షమెప్పుడు



**ఎల్ఎన్ పేట, డిసెంబర్ 8(వార్త):** మోదుగవలస జంక్షన్ నుంచి కొమ్ము వలస, గొట్టుపల్లికి వెళ్లే రహదారి అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ రహదారి మీదుగా రాకపోకలు చేయాలంటే విద్యార్థులు, ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. చిన్నపాటి వాన కురిస్తే ఈ రహదారి మీదుగా నడవలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు మండిపడుతున్నారు. వాహనాలు రాకపోకలు సాగించే రహదారి మరమ్మతులు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

**పోలాకి, డిసెంబర్ 8(వార్త):** సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని పోలాకి ఎస్సై ఎన్.రంజిత్‌కుమార్ అన్నారు. ఆదివారం రాజారాంపురం సముద్రం ఒడ్డున పోలీసులు చర్యలు చేపట్టి సందర్శకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# అక్కడ ఫంక్షన్.. ఇక్కడ పార్కింగ్..!

**-కాంప్లెక్స్‌లోకి రానిబస్సులు**

**-ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు**



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 8(వార్త):** అక్కడ ఫంక్షన్ జరిగితే ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి బస్సులు రావడం గగనమే. ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నూతనంగా ఫంక్షన్‌హాల్ నిర్మిచారు. ఇందుకోసం ఆర్టీసీ స్థలం లీజుకి ఇచ్చారు. అధునాతన సౌకర్యాలతో విలాసవంతమైన ఫంక్షన్ హాల్ నిర్మించారు. నిర్మాణాలు జరిగినప్పుడు హాల్ బయట పెద్ద పార్కింగ్ స్థలం ఉన్నట్లు అనిపించింది. తీరా వినియోగం లోకి వస్తే అసలు విషయం బోధపడింది. పార్కింగ్ స్థలంలో టెంట్లు వేసి డెకరేషన్ చేయడంతో పార్కింగ్‌కి అవకాశం లేదు. దీంతో వచ్చిన వాహనాలన్నీ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిలిపి పార్కింగ్ స్థలంగా వాడారు. అంతే కాదు జనరేటర్ వాహనాలు కూడా కాంప్లెక్స్‌లోనే పెట్టారు. దీంతో కాంప్లెక్స్ మొత్తం ఫంక్షన్ హాల్ కబ్జాలోకి వెళ్లింది.

ఫలితంగా బస్సుల రాక పోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఫంక్షన్ జరిగిన రోజు మొత్తం కాంప్లెక్స్ లో వాహనాలు నిలపడంతో బస్‌ల డ్రైవర్లు నిలపడానికి ఇబ్బందులు పడ్డారు. ఫలితంగా ఆవరణలోకి రాకుండానే వెనుదిరిగారు. ప్రయాణికులు, సిబ్బంది కూడా ఇక్కట్లు ఎదుర్కొన్నారు. లగేజీ దింపడం కూడా కష్టమైంది. ఇలా ఫంక్షన్ జరిగే ప్రతిసారి ఇదే తరహాలో జరిగితే కష్టమే. ఇప్పటికైనా అధికారులు మేల్కొని కాంప్లెక్స్ ఆవరణలో వాహనాలు పార్కింగ్ చేయకుండా నిలువరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# గిరిజన భూసమస్యలు పరిష్కరించాలి



**మందస, డిసెంబర్ 8(వార్త):** గిరిజనుల భూసమస్యలను పరిష్కరించాలని శ్రీకాకుళం గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కొండలోగాం పంచాయతీ పట్టులోగాంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఎన్నో ఏళ్లుగా గిరిజనులు భూసమస్యలతో సతమతమవుతున్నారని, అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ, పరిష్కారం దొరకడం లేదన్నారు. నిరుద్యోగులైన గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు అటవీ హక్కులు కల్పించి, పట్టాలు మంజూరు చేయాలన్నారు. గిరిజనేతరులను ఎస్టీలుగా గుర్తించవద్దన్నారు.

గిరిజన ప్రాంతాల్లో సాగు, తాగునీటి సదుపాయం, రహదారులు నిర్మించాలన్నారు. శ్రీకాకుళం జిల్లాకు ఐటీడీఏను మంజూరుచేయాలని ముక్త కంఠంతో కోరారు.

కార్యక్రమంలో సంఘం నాయకులు సవర నారాయణ రావు, సవర నరసింగరావు, సవర జగ్గా రావు, లక్ష్మణరావు, దాశరథి, నర్సింగులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హైందవ శంఖారావంపై గ్రామాల్లో ప్రచారం



**మందస, డిసెంబర్ 8(వార్త):** హైందవ శంఖారావంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి5న విజయవాడలో హైందవ శంఖారావం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మందస మండలంలోని బుడారిసింగి, కృష్ణాపురం, బెల్లుపటియా, నర్సిపురం, పొత్తంగి, బిరుబడియా, సిరిపురం తదితర గ్రామాల్లో పలువురు పర్యటించి, చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి స్వయంప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్ట సవరణ చేయాలని విశ్వహిందూ పరిషత్ ఒక జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సభ ఆహ్వానం, విస్తృత ప్రచారంలో భాగంగా పర్యటనలు జరుపుతున్నామన్నారు. హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి, రక్షణ, సమాజ రక్షణకు జరుగుతున్న హైందవ శంఖారావానికి మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పెద్దలు చంద్రమౌళి, తెలుకుల సురేష్, సూర్యనారాయణ, దేవి, కృష్ణారావు, నీలాంచల్, జానకిరావు, సురేష్ పాణిగ్రహి, బలరాం, రవీంద్ర, రుషి బెహరా, మున్నా పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీకాంత్



**ఎల్ఎన్ పేట, డిసెంబర్ 8(వార్త):** బొర్రంపేట గ్రామంలో ఆదివారం జరిగిన గొల్లపల్లి వారి వివాహ కార్యక్రమములో పాల్గొని రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ నూతన వధూవరులను ఆశీర్వదించారు




**ఎల్ఎన్ పేట, డిసెంబర్ 8(వార్త):**విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే కీలకమని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ అన్నారు విద్యార్థుల బంగారు భవిష్యత్తు, నాణ్యమైన చదువుల కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. శనివారం మండలంలోని కరకవలస ఉన్నత పాఠశాల నందు నిర్వహించిన ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సమావేశాలకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్ఎన్ పేట, డిసెంబర్ 8(వార్త):** : కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల మెగా సమావేశంలో పాతపట్నం నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు పాల్గొన్నారు. తేజేశ్వరరావు స్వగ్రామమైన సరాలి ప్రాథమికోన్నత పాఠశాలలో, ఆయన చదువుకున్న పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇలాంటి సమావేశాలు నిర్వహణ పాఠశాల విద్యావ్యవస్థ బలోపేతానికి దోహద పడతాయన్నారు.




# విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధ్యాయులే కీలకం

**సోంపేట, డిసెంబర్ 8(వార్త):** ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ సమావేశం సోంపేట మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలతో పాటు, రాజాం కస్తూర్భా బాలికల పాఠశాలలో శనివారం పండగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సోంపేట మాజీ జెడ్పీటీసీ సభ్యులు సూరాడ చంద్రమోహన్ పాల్గొని మాట్లాడుతూ ఇది ఒక బృహత్తరమైన కార్యక్రమం అని, ప్రభుత్వ విద్యా బలోపేతానికి ప్రజలను భాగస్వామ్యం చేయడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు భాగ్యస్వామ్యం కావడంతో సమాజాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నిగూఢమైన ప్రతిభను వెలికి తీసి సృజనాత్మకతను జోడించి విద్యార్థిలను ఉన్నతంగా తీర్చి దిద్దడమే లక్ష్యమన్నారు. సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను రూపుమాపడానికి విద్య తోడ్పడుతుందని చెప్పారు. విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేయకుండా క్రీడల్లోనూ వారిని ప్రోత్సహిస్తే మరిన్ని ఫలితాలు రాబట్టవచ్చన్నారు. పండగ వాతావరణంలో నిర్వహిస్తున్న ఈ సమావేశాలు ప్రభుత్వ పాఠశాల విద్య బలోపేతానికి, బడి బయట విద్యార్థుల సంఖ్య తగ్గించడానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటలు పోటీలు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. పిల్లలపై తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# సిక్కోలును క్రీడాహబ్‌గా తీర్చిదిద్దుతా..!

*** ఎమ్మెల్యే గొండు శంకర్**
*** డిగ్రీ కళాశాలలో క్రికెట్ మైదానం నిర్మాణానికి భూమిపూజ**


**శ్రీకాకుళం, డిసెంబర్ 8(వార్త):**సిక్కోలును క్రీడాహబ్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ మైదానం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొంత భాగం క్రికెట్ మైదానం నిర్మాణానికి అంగీకరించిన డిగ్రీ కళాశాల వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. క్రీడల ఖిల్లాగా పేరు పొందిన శ్రీకాకుళం జిల్లాలో క్రీడలకు సరైన వసతులు లేకపోవడం బాధాకరమన్నారు. క్రీడాకారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కోడిరామ్మూర్తి స్టేడియంలో అథ్లెటిక్స్ ట్రాక్, వాకింగ్ ట్రాక్‌తో పాటు క్రికెట్ మైదానంలో, కళింగపట్నంలో క్రికెట్ మైదానం, ఇంటర్నేషనల్ స్టేడియం ఎనిమిది ఎకరాల్లో నిర్మించనున్నామని, అలాగే పాత్రునివలసలో కూడా మైదానాలను సిద్ధం చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామన్నారు.




## ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు

ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవతోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 75 యార్డ్స్ మేర క్రికెట్ మైదానం నిర్మాణానికి ఎంఓయు చేసుకున్నామని జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిధులతో మూడు నెలల కాలంలో యుద్ధప్రాతిపథికన ఓ సుందరమైన, సౌకర్యవంతమైన క్రీడామైదానాన్ని నిర్మిస్తామని చెప్పారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.సురేఖ, సీనియర్ క్రీడాకారులు వండాన మురళీమోహన్, భద్రగిరి మురళీధర్ కుమార్, బాబు, వీవీఆర్ ఎస్ మూర్తి, మనోహర్ పసుమర్తి, రఫీ, అద్నీ, సీనియర్ క్రీడాకారులు, మెంటార్ ఇలియాజ్ అహ్మద్ పర్యవేక్షణలో అసోసియేషన్ అధ్యక్షులు పుల్లెల శాస్త్రి, సెక్రటరీ హసన్‌రాజా, కోశాధికారి షైలానీ, కోచ్ సుదర్శన్, సంఘ ప్రతినిధులు డాక్టర్ సువ్వారి రవికుమార్, ఆబోతుల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం









శ్రీకాకుళం, డిసెంబర్ 8 (వార్త): విశాఖపట్నంలో గల నోవోటెల్ హెూటల్‌లో శ్రీకాకుళం జిల్లా పాతపట్నం శాసన సభ్యులు మామిడి గోవిందరావు కుమారుడు మామిడి జయప్రకాష్ నిశ్చితార్థ వేడుక ఆదివారం వేడుకగా నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రకాష్ దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులతో పాటు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గన్నబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పాతపట్నం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ కేడర్, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్పంచుకున్నారు.

# ఎంజీఆర్ ఇంట..


# పెళ్లిసందడి


* విశాఖలో గోవిందరావు కుమారుడి నిశ్చితార్థ వేడుకలు
* తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు
* జయప్రకాష్ దంపతులను ఆశీర్వదించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు














Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546